


## ఉపోద్ఘాతం

నేను తొలుత కథా రచయితని. తర్వాతే నవలా రచయితని అయ్యాను. నిజనికి నేను డజనులోపు కథలు రాసాకే సీరియల్‌గా ప్రచురించబడ్డ నవలికని లేదా పెద్ద కథని రాసాను. ఈ రెండు రాయడంలోని అనుభవం నాకు చాలా పాఠాలని నేర్పింది.

సాధారణంగా కథలు రాసే చాలామంది రచయితలు నవలలు రాయక పోవడానికి ప్రధాన కారణం కథని విస్తారంగా ఆలోచించ లేకపోవడం అని నా అభిప్రాయం. కథకి ఇతివృత్తం సాధారణంగా పాత్రలు కానీ, సన్నివేశాలు కానీ అరడజనుకి మించి ఉండవు. అదే నవలైతే సన్నివేశాలు కనీసం వందకి పైగా ఉంటాయి. పైగా అవన్నీ ఒకదానికి మరొకటి కథకు అనుసంధానమై ఉండాలి. పాత్రలు కూడా ఎక్కువగానే ఉంటాయి. పూర్వం కథలో సస్పెన్స్ లేకుండా రాసుకువెళ్ళేవారు కానీ ఇప్పుడు ప్రతీ సంచికలో సీరియల్లో వచ్చిన కథ తర్వాతి సంచికకి ఎదురు చూసేదిగా ఉండాలనే నిబంధన వచ్చింది. దాంతో ఇవన్నీ ఆలోచించుకుని రాయడం కథాప్రక్రియకి పరిమితమైన రచయితలకి సాధ్యం కాదు. కథని ఓ రోజులో రాసేస్తారు. అదే నవలైతే కొన్ని వారాలు రాయాలి. కథ రాయడానికే బద్ధకించే రచయితలకి రాసింది గుర్తుంచుకుని రాసేంత ఓపిక ఉండదు. కొందరు ఓ నవల కోసం ఖర్చు చేసిన కాలంలో పది - పదిహేను కథలు రాస్తే వాటిలో సగమైనా అచ్చవుతాయి, నవల అంగీకరించబడుతుందన్న గేరంటీ లేదు అని కూడా రాయరు. మొదట్లో నేను కూడా ఇలా ఆలోచించినవాడినే. పై కారణాల వల్ల నవలా ప్రక్రియ మరింత క్లిష్టమై రచయితలు నవలలని రాయడానికి దూరం అయ్యారు.

ఆంధ్రభూమి వార పత్రిక ఎడిటర్ సి.కనకాంబరరాజు సీరియల్స్ విషయంలో తీసుకున్న చొరవ, చేసిన వివిధ ప్రయోగాలు విజయవంతం అయి నేను, వీరేంద్రనాథ్ మంచి సీరియల్ రచయితలుగా పేరు తెచ్చుకున్నాం. అంతకు ముందు వీరేంద్రనాథ్, నేను కూడా సీరియల్ నవలలని రాసిన వారమే. కానీ భూమి వీక్లీలోని మా సీరియల్స్ ద్వారా మాకు వచ్చిన గుర్తింపు అంతకు మునుపు వేరే పత్రికల్లో రాసిన వాటికి రాలేదు. కనకాంబరరాజు మా ఇద్దరినే కాక చాలమంది రచయితలని మంచి నవలా రచయితలుగా ప్రమోట్ చేసేందుకు కృషి చేసారు. మా ఇద్దరి కన్నా సికరాజుకి చందుసోంబాబు అంటే ఇష్టం. వారికి మాకన్నా చాలా ముందునించే ఒకరితో మరొకరికి పరిచయం ఉంది. చందు సోంబాబు పెళ్ళికి హాజరైన సికరాజు ఓ తెల్లకాగితాల పుస్తకం మొదటి పేజీలో ‘మీరు రాసే సీరియల్ నవల ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురణకి అంగీకరించబడిందని తెలియచేయడానికి సంతోషిస్తున్నాను. చక్కటి వైవాహిక జీవితానికి శుభాకాంక్షలతో‘ అని రాసి సంతకం చేసి ఇచ్చారు.



ఐనా ఆయన ప్రమోట్ చేసిన రచయితలు పాఠకుల్లో పెద్దగా గుర్తింపుని పొందలేకపోయారు. కారణం నవల రాసే గ్రామర్ మా ఇద్దరికీ తెలిసినట్లుగా ఇతర రచయితలకి, రచయిత్రులకి తెలియకపోవడమే. ఈ వాస్తవాన్ని అహంకారంగా తీసుకోరని ఆశ. ఇటీవల వీరేంద్రనాథ్ రాసిన 'డేగ రెక్కల చప్పుడు' చదివితే నేను చెప్పే దాంట్లోని వాస్తవం అర్థమవుతుంది. నవల గ్రామర్ తెలిసిన, రాసే సత్తా ఉన్న రచయిత కనుక అంత మంచి నవలని రాయగలిగారు. నిజానికి రచయితల కన్నా సికరాజు రచయిత్రులని టాప్ సీరియల్ నవలా రచయిత్రులుగా ప్రమోట్ చేయాలని తపన పడ్డారు. దాదాపు ఓ డజను మంది రచయిత్రులని ఆయన అలా పరిచయం చేసారు. కానీ ఆ రచయితల, రచయిత్రుల పేర్లు నేటి పాఠకులు మర్చిపోయారంటే, అది తప్పు పాఠకులది కాదు. వారు గుర్తుంచుకోదగ్గ నవలలు రాయకపోవడం వారి తప్పు. ఆ దృష్ట్యా ఇది అహంకారం కాదని మనవి.

'తులసిదళం' లాంటి సెన్సేషనల్ నవల ద్వారా యండమూరి వీరేంద్రనాథ్ పేరు పాఠకులకి నోటెడ్ అయింది. ఇలాంటి ఖ్యాతి అంతకు మునుపు ఒక్క 'చక్రభ్రమణం' సీరియల్ ద్వారా కోడూరి కౌసల్యాదేవికి, 'సెక్రటరి' నవల ద్వారా యద్దనపూడి సులోచనారాణికి మాత్రమే లభించాయి. ఆంధ్రజ్యోతి వీక్లీ ద్వారా పురాణంగారు తనకి ఇష్టమైన కొందరు రచయితలని చక్కగా ప్రాజెక్ట్ చేయడంతో వారికి పాఠకుల్లో గుర్తింపు లభించింది. అందుకు రావిశాస్త్రి చక్కటి ఉదాహరణ.

నేను నవలలకన్నా కథలే ఎక్కువ రాసాను. మూడువేల పై చిలుకు కథలు రాసినా కథా రచయితగా కంటే నేను రాసిన దాదాపు నూటపాతిక నవలల ద్వారానే పాఠకులకి నా పేరు గుర్తుండిపోయింది. నిజానికి తెలుగులో అత్యధిక కథలు రాసిన రచయితని నేనని చాలామందికి తెలీదు. వందేళ్ళ తెలుగు కథ పండుగలని ప్రపంచ వ్యాప్తంగా 2010లో చేసినా ఈ విషయాన్ని ఎవరూ ప్రస్తావించక పోవడానికి కారణం ఇది పట్టించుకోకపోవడమే. లోపం నాలోనూ ఉంది. నేను కూడా ఆ సంగతి పదిమంది గుర్తించాలనే తపన ఉన్నవాడిని కాదు. తెలుగులో జీవించి ఉన్న వారికి స్వప్రయత్నంతోనే ఇలాంటి గుర్తింపు లభిస్తుంది కదా! ఒక్క కథాసంపుటాల్లోనే నా కథలు దాదాపు ఒక వందకి అటు ఇటూగా వెయ్యికి పైనే వెలువడ్డాయి. అపరాధ పరిశోధక, పిల్లల, సాంఘిక ఆధ్యాత్మిక, అనువాద, ఇతర తరహాలకి చెందిన కథలని మొత్తం మూడువేల పై చిలుకు రాసాను. ఐనప్పటికీ కథ వెనక కథని రాయక, నవల వెనక కథ రాయడానికి కారణం పాఠకులకి కథతో కన్నా నవలతో ఉన్న అనుబంధం ఎక్కువ కనుక.

కథ కన్నా పాఠకులకి నవల ఎలా ఇష్టమో అలా నవల కన్నా సినిమా పాటలతో అనుబంధం ఎక్కువ. ఆ కారణంగా సినిమా రచయితకీ నవలా రచయితకి ప్రధానంగా ఖ్యాతిలో, ఆదాయంలో ఎంతో వ్యత్యాసం ఉంది. పాఠకేతర ప్రజలకి పత్రికల్లో రాసే రచయితల పేర్లు పెద్దగా తెలీదు కాని, సినిమా గీత రచయితల పేర్లు తెలుసు. ఆత్రేయ, ఆరుద్ర, వేటూరి సుందరరామ్మూర్తి, సీతారామశాస్త్రి లాంటి పేర్లు ప్రజలకి తెలిసినట్లుగా పి.ఎస్.నారాయణ, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ప్రతాప రవిశంకర్ లాంటి కథా రచయితల పేర్లు, పొత్తూరి విజయలక్ష్మి, జలంధర, డి.కామేశ్వరిలాంటి నవలా రచయిత్రుల పేర్లు వారెంత మంచివి రాసినా సామాన్య ప్రజలకి తెలియవు. నా పేరు కూడా పాఠకులు కాని వారిలో చాలామందికి ఇప్పటికీ తెలీదు. నేను జనవరి 2012 నుంచి తెలుగు ఒన్ డాట్ కామ్‌లో ప్రతీ శుక్రవారం రాత్రి తొమ్మిదిన్నర నుంచి పదకొండున్నర దాకా ఇంటర్ నెట్ లైవ్ రేడియోలో నిర్వహించే 'మల్లాది ముచ్చట్లు' కార్యక్రమానికి ఇటీవల

ఓ శ్రోత ఫోన్ చేసి 'నా పేరు ఎన్నడూ వినలేదని, నేను చెప్పేది విని బావుంటే ఫోన్ చేస్తున్నానని' చెప్పారు. ఇందుకు కారణం, తెలుగులోని తొమ్మిదికోట్ల మంది ప్రజల్లో పాఠకుల సంఖ్య పది లక్షల లోపే. దీన్ని బట్టి రచయిత ఏ మాధ్యమానికి రాస్తున్నాడు అన్న దాని మీదే అతనికి గుర్తింపు లభిస్తుంది అని చెప్పచ్చు.

విదేశాల్లో తెలుగు వాళ్ళు నిర్వహించిన సభలకి, సన్మానాలకి సినీ రచయితలని ఆహ్వానించారు కానీ కథ లేదా నవలా రచయితలని ఇంతదాకా పిలిచిన దాఖలాలు లేవు. తమ ఎదుట పెర్ఫామ్ చేసి వినోదాన్ని అందించే ఆర్టిస్ట్‌లని మాత్రమే వారు ఆహ్వానిస్తూంటారు. రచయితలు దీన్ని సరదాకి ఫేస్ వేల్యూ అంటారు. అంటే, అక్కడి వారికి వెండి తెర ద్వారా ముఖ పరిచయం గల, పెర్ఫామింగ్ ఆర్టిస్టులు కావాలి అని అర్థం. నా నవలల ఆధారంగా కొన్ని సినిమాలు వచ్చి, తెరమీద నా పేరు కనబడ్డా కథాప్రతిభ అంతా కూడా దర్శక రచయిత అయిన శ్రీ జంధ్యాలకే దక్కింది. మిగిలిన దర్శకులు తీసిన సినిమాలు సుమారుగా ఆడడంతో సినిమా రచయితగా కూడా నా పేరు సెకండరీ అయిందని నేను భావిస్తున్నాను. సినీ, సినీయేతర రచయితల మధ్య ప్రధానంగా నేను గమనించిన తేడా ఇది.

పాఠకులకి నవలతో గల అనుబంధం దృష్ట్యా, ఈ సంచిక నుంచి నెలనెలా మీకు నేను రాసిన నవలలని ఆ క్రమంలో పరిచయం చేస్తూంటాను. వాటి ఇతివృత్తాలు ఎలా తట్టాయి, వెండి తెరకి ఎలా వెళ్ళాయి లేదా ఎలా వెళ్ళలేదు, పాత్రల్ని ఎలా మలిచాను, కథని ఎలా డెవలప్ చేసుకున్నాను, విషయ సేకరణకి నేను ఏ మూలం ఎలా వెదికాను, పాఠకుల నుంచి వచ్చిన స్పందన, దాన్ని రాయడానికి ఎలాంటి కృషి చేసాను. అది సినిమాగా లేదా టివి సీరియల్‌గా మలిస్తే ఆ సందర్భం, దానికి నాకు ఇన్స్పిరేషన్ ఏదైనా విదేశీ నవలలు ఆధారమూ, అవి ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయా, ఎవరైనా లీగల్ నోటీస్‌లు ఇచ్చారా, ఏ నవలైనా కోర్ట్ గడప తొక్కిందా లాంటి విషయాలు కూడా అలాంటివి జరిగిన సందర్భాలు ఉంటే వాటిని ప్రస్తావిస్తాను.

నేను అసలు ఎలా రచయితని అయ్యాను? నా మొదటి రచన ఏమిటి? లాంటివి దీని ముందు భాగం అయిన జరిగిన కథలో మీరు చదవచ్చు. అది ఆగస్ట్ నెలాఖరుకల్లా పుస్తకంగా వెలువడుతోంది.




***అద్దెకిచ్చిన హృదయాలు***

సీరియల్‌గా వెలువడ్డ నేను రాసిన మొదటి నవలిక అద్దెకిచ్చిన హృదయాలు. 10 అక్టోబర్ 1972 సంచిక నుంచి వరసగా ఐదు సంచికల పాటు నవంబర్ 8 1972 దాకా ఇది 'ఆంధ్రప్రభ' వారపత్రికలో సీరియల్‌గా ఐదువారాలు వెలవడింది. విషయ సూచికలో కథలు, సీరియల్స్ అని హెడ్డింగ్ పెట్టి వేటి పేర్లు వాటిలో వేసేవారు. కథలు హెడ్డింగ్ కిందే 'అద్దెకిచ్చిన హృదయాలు' పేరుని వేసారు. ఈ నవలకి థీమ్ నాకు నా రొటీన్ జీవితంలోని అబ్జర్వేషన్ లోంచి దొరికింది. అప్పట్లో నేను ఉప్పల్ లోని సర్వే ఆఫ్ ఇండియా దాటాక ఉన్న పెంగ్విన్ టెక్స్‌టైల్స్ లిమిడెట్‌లో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పనిచేసేవాడ్ని. అప్పటికి నేను పుట్టి పెరిగిన విజయవాడ వదిలి వచ్చి కొన్ని నెలలే అయింది. విద్యార్థిగా ఉండగా రచయిత కాని నేను ఉద్యోగి అయ్యాక రాయడం మొదలుపెట్టాను. ఆ వివరాలన్నీ జరిగిన కథలో విపులీకరించాను.

నేను బస చేసిన రాష్ట్రపతి రోడ్‌నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కి చేరుకుని అక్కడ నుంచి ఉప్పల్‌కి వెళ్ళే బస్ నంబరు 6 ఎఫ్. సికింద్రాబాద్

స్టేషన్ ఆవరణ నుంచి బస్ కదిలి కుడివైపు తిరిగి కొంచెం ముందుకి వెళ్ళగానే మొదటి బస్ స్టాప్ వచ్చేది. అక్కడ రోడ్‌కి ఎడమవైపున ఓ పసుపు పచ్చ భవంతి కనిపించేది. అంటే నేటి బస్ టెర్మినస్ ఎదురుగా. దాని కాంపౌండ్ వాల్ గోడ వెనుక లోపల నిలబడ్డ టీనేజ్ అమ్మాయిలు ఐదారుగురు ఆ సమయంలో సదా కనిపిస్తుండేవారు. బహుశ అక్కడ అరుగు ఉండి ఉండాలి. బస్‌లో వెళ్ళేప్పుడు, తిరిగి వచ్చేప్పుడూ ఆ ఇంటిని ఆసక్తిగా గమనించేవాడిని. కనీసం ఒకరిద్దరైనా అమ్మాయిలు కాలక్షేపం కోసం కాంపౌండ్ గోడ వెనక నుంచి కనిపించేవారు. వీరు ఆ పెద్ద లోగిలిలో అద్దెకున్న అనేక కుటుంబాలకి చెందినవారు. వాళ్ళని నిత్యం చూస్తున్న బ్రహ్మచారి అయిన నాకు ఆ ఇంట్లో ఓ గది అద్దెకి దొరికితే బావుండనే ఆలోచన వస్తూండేది. ఒకవేళ నిజంగా దొరికితే? దాదాపు ఏడాది సాగిన ఆ ఆలోచనలోంచి రూపు దిద్దుకున్న నవలిక *అద్దెకిచ్చిన హృదయాలు*.

దీన్ని కథగా మొదలుపెట్టాను. ఆరుగురు అమ్మాయి పాత్రలు గల అందులో ఒకో అమ్మాయికి రెండు, మూడు సీన్లు రాయడంతో అది అంతకు మునుపు నేను రాసిన కథలు అన్నిటికన్నా పెద్దగా వచ్చింది. ఐతే అప్పటికి నావి ఐదారు కథలు మాత్రమే ప్రచురింపబడ్డ ఆంధ్రప్రభ వారపత్రికకి దాన్ని వేస్తారా, లేదా అనే అపనమ్మకంతో పంపే ధైర్యం చేయలేకపోయాను. ఇంతలో అకస్మాత్తుగా పోస్టల్ స్ట్రయిక్ వచ్చింది. ఒక్క అబిడ్స్‌లోని హెడ్ పోస్టాఫీస్ మాత్రమే పనిచేసేది. స్ట్రయిక్ వలన ఆంధ్రప్రభకి నవలలు రావడం ఆగిపోతుందని, వారికి నవల అవసరం ఉంటుందనే అమాయకపు ఆలోచనతో అబిడ్స్ పోస్టాఫీస్‌కి వెళ్ళి 'అద్దెకిచ్చిన హృదయాలు'ని ఆంధ్రప్రభకి పోస్ట్ చేసాను. అది అందిన ఐదోవారంలోనే సీరియల్ మొదలవడంతో వారి వద్ద ఇంకో సీరియల్ లేక నాది వేసారని నేను చాలాకాలం అనుకునేవాడిని. వారు ఏడాదికి ముందే సీరియల్స్‌ని ప్లాన్ చేసుకునే వారని తర్వాత తెలిసింది. సాదాసీదా పేర్లుగల వారు ఐడెంటిఫై చేసుకుంటారనే ఉద్దేశంతో దాంట్లోని హీరో పేరు సాదాసీదాగా ఉండాలని విజయవాడలో మా ఎదురింట్లోని ఒకతని పేరు అచ్యుతం. నేనా పేరు మళ్ళీ ఎక్కడా వినలేదు. చదవలేదు. అందుకని అరుదైన ఆ సాదాసీదా పేరుని హీరోకి పెట్టాను.

ఆ కథ సారాంశం, వివిధ టీనేజ్‌లలోని ఆరుగురు అమ్మాయిలు అద్దెకి ఉండే ఓ లోగిలిలో ఓ బ్రహ్మచారి అద్దెకి ఉంటాడు. డాక్టర్ అంటే అందరికీ క్రేజ్ కాబట్టి అతన్ని మెడికోని చేసాను. కొన్ని సంఘటనలవల్ల అతను ఆ అమ్మాయిలందర్నీ ఇష్టపడతాడు. ఎవరికి వారు అతను తననే ప్రేమిస్తున్నాడు, తననే పెళ్ళిచేసుకుంటాడు అని నమ్ముతారు. ఓ అమ్మాయి కోరితే అచ్యుతం సిగరెట్ కాల్చడం మానేస్తాడు. ఈ సన్నివేశం నేను చూసిన ఓ యదార్థ సంఘటనలోంచి అల్లుకున్నాను.

విజయవాడలో నేను బి.కాం ఫైనల్ ఇయర్ చదివేప్పుడు, 1968-69లలో సాయంకాలాలు గాంధీనగర్ లోని మునిసిపల్ పార్క్‌కి వెళ్తూండేవాడిని. ఆ పార్క్ ఎదురుగా ఉన్న మేడలో ఉండే ఓ పదకొండేళ్ళ అమ్మాయి కూడా ఆ పార్క్‌కి వచ్చేది. తెల్లగా ఆకర్షణీయంగా ఉండే ఆమె మాతృభాష కన్నడం. ఆమె తండ్రి ఓ హోటల్ యజమాని. గిరి అనే అతనికి న్యూ ఇండియా హోటల్ సెంటర్లో పుస్తకాల బండి ఉండేది. అతన్నించి నేను 'మాయామయి' అనే పది భాగాల పుస్తకాలు కొన్నాను. అతను కూడా ఆ పార్క్ కి వచ్చేవాడు. అతనికి ఆ అమ్మాయి అంటే ఇష్టం ఏర్పడి ఆ అమ్మాయిని చూడటానికే పార్క్‌కి వచ్చేవాడు. ఆమెతో మాట్లడేవాడు. ఆమె ఏ రోజైనా పార్క్‌కి రాకపోతే గిలగిల్లాడిపోయేవాడు. గిరి ఓ రోజు నాతో సిగరెట్ మానేసానని చెప్పాడు.

నవలికలో చివరికి ఏ ఒక్కరిని అతను పెళ్ళాడినా మిగిలిన నలుగురు బాధపడతారు. పాఠకులు కూడా అసంతృప్తి చెందుతారు. కాబట్టి దీన్ని పరిష్కరిస్తూ మానసిక శాస్త్రంతో ముడిపెట్టి ఆ కథని ముగించాను. అది నా తొలి సీరియలే అయినా వారం వారం దాన్ని పాఠకులు ఎంతో ఆసక్తిగా చదివారు. ఆ విధంగా 'అద్దెకిచ్చిన హృదయాలు' నవలిక రచయితగా నా పేరు పాఠకులలో, తోటి రచయితలలో మంచి గుర్తింపు పొందడానికి ఎంతో దోహదం చేసింది. ఈ ఐదు వారాల నవలికకి వారానికి ఏభై రూపాయలు చొప్పున రెండువందల ఏభై రూపాయలు పారితోషికం అందుకున్నాను.

ఈ నవలికకి నేను ఆ పేరు పెట్టడం వెనక కూడా ఓ కథ ఉంది. 1960లలో ఆంధ్రపత్రిక వార పత్రికలో 'అద్దెకిచ్చిన హృదయం' అనే ఓ కథ ఒకటి చదివాను. ప్రవాసాంధ్ర విద్యార్ధి, ఓ వృద్ధ దంపతుల మధ్య జరిగిన ఆ కథ నాకు నచ్చి ఆ పేరు గుర్తుండిపోయింది. దాని ఆధారంగా 'అద్దెకిచ్చిన హృదయాలు' అనే పేరుని పెట్టాను. ఈ విషయం నేను ఎక్కడో పేర్కొంటే, నాకు అప్పటికే పరిచయం ఉన్న రావులపాటి సీతారామారావు అనే ఐ.పి.యస్ ఆఫీసర్ ఫోన్ చేసి తనే ఆ కథా రచయితనని చెపితే ఆశ్చర్యపోయాను. ఆయన భోపాల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివే సమయంలో జరిగిన ఓ అనుభవం ఆధారంగా దాన్ని రాసానని చెప్పారు. రిటైరైపోయిన ఆయన తరచు టీవీలోని చర్చల్లో పాల్గొనడానికి వస్తూంటారు.

ఆ నవలిక ప్రచురించబడ్డాక నాకు వరంగల్‌లో మొలుగు రోడ్‌లోని ఇండస్ట్రియల్ ఏరియాలోని అశోకా పంప్స్‌లో ఫేక్టరీ అకౌంటెంట్ ఉద్యోగం రావడంతో సికిందరాబాద్ నుంచి అక్కడకి వెళ్ళాను. దాంతో ఆ ఇంటిని చూసే సదవకాశం పోయింది. కొద్ది నెలలు తర్వాత తిరిగి హైదరాబాద్ వచ్చేసాను. స్టేషన్ నుంచి అటుగా వెళ్ళినప్పుడు ఆ ఇంటిని చూసేవాడిని. ఆ ఇంట్లోని అమ్మాయిలు మారారు కానీ వారు గోడ వెనుక నిలబడటం మాత్రం మారలేదు. చాలా ఏళ్ళు ఆ ఇల్లు అలాగే ఉంది. కొన్నేళ్ళ తర్వాత ఓ రోజు నేను సికింద్రాబాద్ స్టేషన్ ప్రాంతంలోని ఆ బిల్డింగ్ ఉన్నచోట ఓ పెద్ద కమర్షియల్ కాంప్లెక్స్ ఉండటం చూసి కొద్దిగా బాధపడ్డాను. ఆ కాంప్లెక్స్‌లో నడిపే సౌత్ ఇండియన్ రెస్టారెంట్‌కి తరచు వెళ్ళేవాడిని.

నేను ఆ కథ జరిగే స్థలంగా అదే ఇంటిని రంగుతో చిరునామాతో సహా నవల్లో వర్ణించాను. కొందరు పాఠకులు 'అద్దెకిచ్చిన హృదయాలు' చదివి, ఆ ఇంట్లోని అమ్మాయిలని చూసి రాసానని గ్రహించారని నాకు వచ్చిన ఉత్తరాలని బట్టి తెలిసింది. ఆ ఇంట్లోని ఓ అమ్మాయి కూడా అది చదివి తమ మీదే రాసానని అప్పుడే గ్రహించింది. ఓ సందర్భంలో ఆ అమ్మాయి నాకు పోస్ట్ బాక్స్‌కి ఉత్తరం రాసి 'అద్దెకిచ్చిన హృదయాలు' కథని తమ మీదే రాసానా అని అడిగింది. దీనికి తరువాయి భాగం కూడా రాసాను. అది ఎమెస్కోవారు ప్రచురించే మాసపత్రికలో వచ్చింది. కానీ అందులో ఈ మొదటి భాగంలోని మృదుత్వం, ప్రేమ, అమాయకత్వాలు లేవు. జీవితంలో నలిగిపోయిన వారికి చెందిన నెగెటివిటీ ఉంది. కాబట్టి దాన్ని అలాగే సమాధి కానివ్వమని 'అద్దెకిచ్చిన హృదయాలు' పుస్తకంలో రెండో భాగంగా వేయలేదు.

దీన్ని ఎమెస్కోవారు 1975లో 'మిసెస్ పరాంకుశం' అనే మరో నవలికతో కలిపి బాపు గీసిన బొమ్మతో పాకెట్ బుక్‌గా ప్రచురించారు. తర్వాత 1983లో అనుకుంటా 'దూరం' నవల చివర్లో ప్రచురించబడింది. విజయవాడలో, ఏలూరు రోడ్‌లో నవజ్యోతి అనే పుస్తకాల షాపు బయట గోడమీద ఆ రోజుల్లో ఎమెస్కోవారు ఆ పుస్తకానికి బాపు చేత గీయించిన బొమ్మనే ఈ పుస్తకానికి వేయించారు. ఆ బొమ్మలో మధ్యలో ఎత్తిన చేతిలో పుస్తకం పట్టుకున్న అచ్యుతం. చుట్టూ అమ్మాయిలు. ప్రస్తుతం ఇది పుస్తక రూపంలో అందుబాటులో లేదు. త్వరలో లావణ్య అనే ఇంకో నవలతో కలిపి దీన్ని లిపి పబ్లికేషన్స్ ప్రచురించబోతోంది. మయూరి అనే కన్నడ మాసపత్రికలో ఇది 'బాడిదకొట్టి హృదయగళు' అనే పేర అనువదింపబడి ప్రచురింపబడింది.

ఇది ప్రచురించబడ్డ నాలుగైదు సంవత్సరాల తర్వాత ఓ సందర్భంలో ఆంధ్రప్రభలో ఎడిటోరియల్ శాఖలో పని చేసే ఎల్లోరాని రచయిత వి.రాజారామ్మోహన్ రావు హైదరాబాద్‌లో పరిచయం చేసారు. ఆయన చెప్పారు, రాగానే తను 'అద్దెకిచ్చిన హృదయాలు'ని చదివి వెంటనే ఎంపిక చేస్తే దాన్ని ప్రచురించారని, సినీనటుడు బెనర్జీ ఆర్టిస్ట్ కాకమునుపు 1980లలో అసిస్టెంటు ఎడిటర్‌గా పని చేసే కాలం నుంచి నాకు బాగా పరిచయం. అతను చాలసార్లు చెప్పారు. 'అద్దెకిచ్చిన హృదయాలు' సినిమాకి పనికి వస్తుందని, ఎందుకో ఎవరి దృష్టి దానిమీద పడలేదని.

***<u>అద్దెకిచ్చిన హృదయాలులోని ఓ భాగం చదవండి.</u>***

అందరూ అచ్యుతంతో పాటు కారు దిగి లోపలికి నడిచారు. హాల్లోని సోఫాల్లో కూర్చుని ఉన్న వాళ్ళ వంక చూసి, "వీళ్ళేనా?" అని అడిగాడు సైకాలజీ ప్రొఫెసర్ రహస్యంగా.

తల ఊపాడు అచ్యుతం.

పనిమనిషి ట్రేలో కోకో కోలాలు తీసుకు వచ్చి ఇచ్చింది ఫ్రిజ్‌లోంచి అందరికీ. కోక్ పూర్తయ్యేదాకా సైకాలజీ ప్రొఫెసర్ ఆ ఆరుగురితో మాట్లాడుతూ ఉండిపోయాడు.

"నేను, అచ్యుతం ఇప్పుడే వస్తాము ఓ పావు గంటలో. ఆ మేగజైన్స్ చూస్తుండండి."

ఎదురుగా టేబుల్ మీద ఉన్న మేగజైన్స్ వంక చూపించాడు ప్రొఫెసర్.

"మళ్ళీ చెప్పండి మొదటి నుంచి" అడిగాడు ప్రొఫెసర్ అచ్యుతాన్ని, పక్క గదిలోకి వెళ్ళి కూర్చున్నాక.

గొంతు సర్దుకున్నాడు అచ్యుతం. చెప్పసాగాడు;

"దాదాపు సంవత్సరం క్రితం ఆ గది అద్దెకు తీసుకున్నాను. చేరిన నెలరోజుల్లోనే ఆ ఆరుగురు ఆడపిల్లకీ నేనంటే ఇష్టం ఏర్పడింది అని గ్రహించాను. వీలయినంతవరకు నామీద వాళ్ళకి ఏర్పడ్డ ఇష్టం పెరిగేలా ప్రయత్నించాను అనేక విధాలుగా. వాళ్ళ ఆనందంకోసం నా సరదాలు ఎన్నో వదిలేశాను. సాయంత్రం వాకింగ్, స్మోకింగ్ మొదలయిన అలవాట్లన్నీ పూర్తిగా మానేశాను.

వాళ్ళకి నా మీద ఉన్న ఇష్టం క్రమంగా ప్రేమగా మారింది ఒకళ్ళ తర్వాత ఒకరు వచ్చి తమ ప్రేమని వ్యక్తం చేశారు నాకు. నేనూ వాళ్ళని ప్రేమిస్తున్నట్లుగా చెప్పాను."

తన ముఖంలోకి చూస్తూ నవ్వుతున్న ప్రొఫెసర్‌ని చూసి చెప్పడం ఆపాడు అచ్యుత సిగ్గుగా.

"కారీ ఆన్. తప్పులేదు, నీ వయస్సులో, ఆ పరిస్థితుల్లో అలా మభ్యపెట్టడం సహజం" అన్నాడు ప్రొఫెసర్ ప్రోత్సహిస్తూ.

"మభ్య పెట్టడం కాదు. నేను నిజంగానే వాళ్ళని ప్రేమించాను... ప్రేమిస్తున్నాను కూడా." ఆవేశంగా అన్నాడు.

"ఆ ఆరుగురినీ?"

"అవును, ఆ ఆరుగురునీ. నేనంటే ప్రతి ఒక్కరికీ తగని ఇష్టం. చిత్ర నన్ను పెళ్ళిచేసుకోమని అడుగుతోంది. మిగతావాళ్ళు వాళ్ళు కూడా త్వరలోనే అడుగుతారు. నాకోసం ప్రాణం ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారనిపిస్తుంది నాకు, వాళ్ళు నేనంటే చూపించే ఆప్యాయత చూస్తే."

"అందరిలో మీకు ఎవరు బాగా నచ్చారో వాళ్ళని పెళ్ళి చేసుకుంటే ఏ సమస్యా ఉండదు."

"అందరిలో మీకు ఎవరు బాగా నచ్చారో వాళ్ళని పెళ్ళిచేసుకుంటే ఏ సమస్యా ఉండదు."

"అక్కడే అసలు సమస్య ప్రారంభం అయేది. ఇన్నాళ్ళూ నేను ఆ ఆరుగురిని నువ్వు లేకపోతే బ్రతకలేను అని నమ్మించాను. నిజం అంతే కూడా. నాకు అందరూ సమానమే. వాళ్ళలో ఎవరినీ వివాహం చేసుకున్నా, మిగతా అయిదుగురు బాధపడతారు. బాధపడటమే కాదు. నమ్మించి మోసం చేశాననుకుంటారు. నాకు ఎవరి మనసూ నొప్పించడం ఇష్టం లేదు."

"క్షమించండి ఇలా అడగుతున్నందుకు. వాళ్ళతోఎవరితోనయినా మీకు... మీకు శారీరక సంబంధం..."

"ఛీ, ఛీ! ఎవరితోనూ లేదు. నేను అస్ఖలిత బ్రహ్మచారినని చెప్పుకోను. కాని, వాళ్ళని ఆ దృష్టితో ఎప్పుడూ చూడలేదు నేను. అవకాశం, అవసరం రాలేదు కూడా."

"గుడ్ అయితే, ఎవరినీ పెళ్ళిచేసుకోకుండా మీ దారిని మీరు వెళ్ళిపోవడం మంచిది. ఏ సమస్యా ఉండదు."

"వెళ్ళనివ్వరు. అలా వెళ్ళలేనుకూడా. వాళ్ళు ఆరుగురూ నా జీవితంలో ఓ భాగం అయిపోయారు. వాళ్ళంటే నాకు ఇంత వ్యామోహం ఉందని నేను ఎప్పుడూ ఊహించనైనా లేదు. ఇప్పుడు అర్థం అవుతోంది, వాళ్ళనుంచి విడిపోవలసి వచ్చినప్పుడు. వాళ్ళను విడిచి దూరంగా బ్రతకగలను గాని, ఆ బ్రతుకు దుర్భరంగా ఉంటుంది."

"మీరు వెళ్ళిపోతున్నట్లు తెలుసా వాళ్ళకి?"

"ఇంతవరకు చెప్పలేదు. 'మెడికోస్ క్లబ్' సెండాఫ్ పార్టీ ఇచ్చింది ఈ వేళ. ఏం చేయాలో తోచకపోతే, ఓ స్నేహితుడు మిమ్మల్ని కలుసుకుని సలహా తీసుకోమని మీ అడ్రెస్ ఇచ్చాడు."

"ఈ పాటికి చెప్పేసి ఉండవలసింది మీరు."

"ఏం?"

"మీరు వాళ్ళని వదిలి వెళ్ళిపోవడం తప్పనిసరి అయినప్పుడు, ఆ సంగతి ముందే తెలియడం మంచిది. సరిగ్గా వెళ్ళబోయే ముందు చెబితే బాధ ఎక్కువగా ఉంటుంది. ముందే తెలిసిపోతే, బాధ ఎక్కువ ఉండదు. తగ్గిపోతుంది క్రమంగా."

"అలా అయితే ఇంటికి వెళ్ళేటప్పుడు చెప్పేస్తాను. వాళ్ళు పెళ్ళి గురించి నన్ను అడుగుతారు, ఒక్కొక్కరూ. ఏం చెప్పాలి? చేసుకోననా? చెప్పలేను."

"చేసుకోలేరుకూడా. ఆరుగురిని ఒకరే చేసుకుంటే చట్టం ఒప్పుకోదు. అందులో ఒకరిద్దరు తప్ప మిగతా వాళ్ళకి ఇంకా పెళ్ళి చేసుకునే అర్హత రాలేదు, చట్టం దృష్టిలో. పద్దెనిమిదేళ్ళలోపు వాళ్ళే."

"ఏం చేయాలి నేను?" అన్నాడు అచ్యుతం దీనంగా.

సెల్లోఫెన్ పేపర్ చుట్టి ఉన్న సిగార్ తీసి, లైటర్‌తో అంటించి అన్నాడు సైకాలజీ ప్రొఫెసర్.

"మీది చాలా డెలికేట్ ప్రాబ్లెం. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి చేసుకోకుండా ఉండలేరు. ఏ ఒక్కరిని చేసుకున్నా మిగతా వాళ్ళని అన్యాయం చేసినట్లవుతుంది, ఆశలు రేపి."

"అవును."

"మీరే ముందరే ఆలోచించి ఉండవలసింది ఈ విషయం."

"ఎప్పుడూ ఆలోచించలేదు. ఇలా పరిణమిస్తుందని అనుకోలేదు కూడా."

"ప్చ్! మీ వయసులో ఉన్న యువకులలో ఉన్న దౌర్బల్యమే ఇది. కనపడిన ప్రతి ఆడపిల్లతోనూ పరిచయం పెంచుకోవాలనీ, ప్రేమించబడాలనీ ప్రయత్నిస్తారు. చివరికి పెళ్ళి ప్రసక్తి వచ్చినప్పుడు తోక్కముడిచి పారిపోతారు. దీనివల్ల వాళ్ళు ఎంత బాధ పడతారో గుర్తించరు మీరు."

"అవును. నేను చేసింది తప్పే ఒప్పుకుంటున్నాను. తప్పని ఇప్పుడే తెలుసుకున్నాను. ఏం చెయ్యను? కేవలం గది మాత్రమే అద్దెకు తీసుకోలేదు నేను డబ్బుకి. ఆ ఇంట్లో ఉన్న కన్నెపిల్లల హృదయాలు కూడా నాకు తెలియకుండానే అద్దెకు తీసుకున్నాను ఆప్యాయత ఇచ్చి. గది తిరిగి ఇచ్చేసినంత తేలికగా వాళ్ళ హృదయాలని తిరిగి ఇవ్వలేను.. ఐ యామ్ ఇన్ ఎ ఫిక్స్."

సిగార్ తాగుతూ కొన్ని క్షణాలు ఆలోచిస్తుండిపోయాడు. ప్రొఫెసర్. మౌనంగా ప్రొఫెసర్ వదిలే నీలం రంగు సిగార్ పొగవంక చూస్తుండిపోయాడు అచ్యుతం.

"వాళ్ళకి నీ మీద మంచి అభిప్రాయం, ఇష్టం ఉన్నాయి. ప్రస్తుతం ఆ గదిలోంచి, వాళ్ళ బారినుంచి బయట పడాలంటే ఒక ఉపాయం" అని ఆగాడు ఆయన.

"ఏమిటది?" అడిగాడు అచ్యుతం, ముందుకి వంగి ఆత్రంగా.

"నువ్వంటే వాళ్ళకున్న మంచి అభిప్రాయం చెరిగిపోతే, సహజంగా నీమీద ఇష్టం, ప్రేమా పోతాయి. చెడు అభిప్రాయం విధంగా కలిగించుకోవాలో నేను చెప్పక్కరలేదు. చాలా తేలిక. ఉదాహరణకి చిత్ర వచ్చినప్పుడు చేయి పట్టుకుని లాగి పశువులా..."

"వద్దు, వద్దు. ప్రాణం ఉండగా అలా చేయలేను. నా చేత కాదు" అన్నాడు అచ్యుతం ఉద్వేగంగా.

ఆష్‌ట్రేలో సిగార్ బూడిద రాల్చి, చిన్నగా నవ్వుతూ అన్నాడు సైకాలజీ ప్రొఫెసర్: "నాకు తెలుసు, మీరు అందుకు ఒప్పుకోరని. వాళ్ళందరికీ మీ మీద ఉన్న ప్రేమ, ఇష్టం, ఆరాధన, ఆప్యాయత ఎక్కువ కాలం ఉండవు."

"కాదు. తప్పకుండా ఉంటాయి."

దాదాపుగా అరిచాడు అచ్యుతం.

"ఉండవు. పొరపాటు పడుతున్నారు. హ్యూమన్ సైకాలజీ గురించి నాకు ముప్పై రెండేళ్ళుగా తెలుసు. వాళ్ళందరినీ చూశానుగా?"

"నేను నమ్మలేను. నేనంటే వాళ్ళకి ప్రాణం."

"ఇప్పుడు మాత్రమే."

"ఎప్పటికీ ఉంటుంది."

"యూజ్ రేషనల్ థింకింగ్. సింపుల్. వెరీ సింపుల్.

అందరూ ఎర్లీ టీన్స్‌లో ఉన్నప్పుడు ప్రేమించాలనీ, ప్రేమించబడాలనీ అందరికీ కోరిక కలగడం సహజం. అలా ప్రేమించబడాలనీ, ప్రేమించాలనీ కలలు గనే వయసు. ప్రేమించడానికి అందుబాటులో ఉన్న ఎవరినయినా ప్రేమిస్తారు. మీరు తప్ప ఇంకెవ్వరు అందుబాటులో లేరు. దొరకలేదు వాళ్ళకి. మీలో ప్రత్యేకత ఏమీ లేదు - స్మార్ట్ పెర్సనాలిటీ, పెద్ద చదువు తప్ప. ఏమీ అనుకోకండి, ఉన్నమాట కుండ బద్దలు కొట్టినట్లు చెప్పినందుకు."

జాగ్రత్తగా సైకాలజీ ప్రొఫెసర్ చెప్పేది బుర్ర కెక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు అచ్యుతం.

"మీ మీద ఉన్న ప్రేమ, ఆకర్షణ క్రమంగా తగ్గిపోతాయి, వయస్సు పెరిగి లోకం అంటే ఏమిటో తెలిసినకొద్దీ. కొత్త పరిచయాలు అభివృద్ధి అయినకొద్దీ, మీరు ఇప్పుడే విడిపోతే మీమీద ప్రస్తుతం వాళ్ళ హృదయాలలో ఉన భావన ఎల్లకాలం నిలిచేందుకు ఆస్కారం ఉమి. టీన్స్ దాటగానే, ఇప్పుడు మీరు కనబడుతునంత ఆకర్షణీయంగా కనపడరు. ఊ... ఉదాహరణకి, రోమియో ఎండ్ జూలియట్. ఎర్లీటీన్స్‌లోని ప్రేమికులు. వాళ్ళ వయసు ఇంకా ఎక్కువై ఉంటే మామూలుగా ప్రవర్తించగలిగే వాళ్ళు.మరణించేవాళ్ళు కాదు."

మౌనంగా ఆలోచిస్తూండిపోయాడు అచ్యుతం, ప్రొఫెసర్ చెప్పిన మాటలు.

"ఆఫ్‌కోర్స్. ఇది నా థియరీ మాత్రమే, ప్రతి థియరీకి మినహాయింపులుంటాయి"

"ఐ యామ్ ఇన్ ఎ సూప్."

"బయటపడవచ్చు దానిలోంచి. మీరెక్కడా చదవలేదా? ఇంగ్లండ్‌లో ఎర్లీ టీన్స్ వాళ్ళకే ఎక్కువగా పెళ్ళికాకుండా కడుపు వచ్చేది. ఆ వయస్సులో ప్రేమ సాధారణం. స్థిరమయిన ప్రేమకాదు. అదే ప్రేమ ఇరవై అయిదేళ్ళ అమ్మాయికి కలిగితే ఆ ప్రేమ శాశ్వతంగా ఉండటానికి ఆస్కారం ఎక్కువ ఉంది. వయసులో ఉన్నప్పుడు చెలరేగే కొత్త కోరికలతో వచ్చే ప్రేమ స్థిరమయింది కాదు."

"అంటే నేను ఇక్కడే ఉంటే కొన్నాళ్ళకి నా మీద ఇష్టం తగ్గిపోతుందంటారా?"

"మనుషుల సైకాలజీని జడ్జ్ చేయటంలో నేను ఘటికుణ్ణని చెప్పుకుంటారు. మీరు అది గర్వం అని భావించినా, ఇప్పుడు ఈ స్థితిలో మీరు బయటపడితే చాలా కాలం, బహుశా మట్టిలో కలిసి పోయేదాకా మీరు గుర్తుంటారు వాళ్ళకి."

"తప్పు అడ్రెసు ఇచ్చి, మళ్ళీ వస్తామని చెప్పి పారిపోనా?" అడిగాడు అచ్యుతం.

"మళ్ళీ వస్తావని మాత్రం నమ్మించి వెళ్ళండి. తప్పు అడ్రెసు కనుక్కోగలరు చిత్ర తల్లి దండ్రులు"

"మరేం చేయాలి?"

"ప్చ్! అసలు ఎప్పుడు ఈ యువకులలో మార్పు వస్తుందో! ప్రేమించటం చాలా తేలిక కాబట్టి ప్రేమిస్తారు, కనపడిన ప్రతి అమ్మాయిని, పెళ్ళి గురించి, ఆ ప్రేమ పరిణామాన్ని గురించి ఆలోచించకుండా దిగుతారు రంగంలోకి. మనసుతో ఆటాడకూడదు."

"ఏమని చెప్పను వెళ్ళేటప్పుడు?" అడిగాడు అచ్యుతం కొంచెం ఇబ్బందిగా.

సెలోఫేన్ పేపర్లో చుట్టివున్న కొత్త సిగార్ తీసి అంటించి అన్నాడు సైకాలజీ ప్రొఫెసర్:

"మూడు విధాలుగా చేయవచ్చు. కాని, వాటిలో ఒక మార్గం నాకు బాగా నచ్చింది. మంచిది అవునో కాదో నేను నిర్ణయించలేను. మూడూ విన్నాక ఏది మంచిదని తోస్తే అది చేయండి మీరు."

"చెప్పండి" అన్నాడు అచ్యుతం ఉత్సాహంగా.

(వచ్చే నెల - మిసెస్ పరాంకుశం)

Click here to share your comments on this story

ప్రస్తుతం లభ్యమౌతున్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి